# ఆధిపత్యం

(కథల సంపుటి)



డా॥ మంతెన సూర్యనారాయణరాజు

# ఆధిపత్యం

(కథా సంపుటి) 2

శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి
ఆర్థిక సహాయంతో ముద్రించబడినది

డా.. మంతెన సూర్యనారాయణ రాజు

**Aadhipathyam**
**(Anthology of Telugu Short Stories)**

**Dr. M. Suryanarayana Raju**

**First Eidtion**
**November, 2009**

**Copies : 1000**

Cover : Karunakar

© With Authour

For Copies

**M.S.N. Raju**
Divya Ruby Aprtments,
Pt No. 316, Ft No. 302, 3rd Floor,
6th Phase, K.P.H.B, Hyd-072
Cell : 9866119355

**Vishalandra Book House**
All Branches
Navodaya Vijayawada & Hyderabad
Praja Sakthi & All Branches

**Sahachara Book House**
Baghlingam Pally, Hyd

**D.T.P. & Printing**
Deepthi Printers,
Gandhi Nagar, Hyd
**Cell : 9949703224**

**Rs : 60**
**$ : 6**

# కథాక్రమం


| | |
|---|---|
| 1. నైవేద్యం | (చేతన-మాసపత్రిక-జూలై, 2007) |
| 2. వచ్చినవాడు ఫల్గుణుడు | (రమ్యభారతి-త్రైమాసికపత్రిక మే,జూన్, జులై,2009) |
| 3. హింసాద్రిగడ్డ | (జనవికాస్-వీక్లీ-22.8.2008) |
| 4. శుభసంకేతం | (మూసీ-మాసపత్రిక-జనవరి,2008) |
| 5. కలయా!నిజమా!! | (మల్లెతీగ-మాసపత్రిక-అక్టోబర్,2007) |
| 6. ఆధిపత్యం | (నది-మాసపత్రిక-నవంబర్,2007) |
| 7. బిచ్చూ!బిచ్చూ! | (విశాలాంద్ర-డైలీ-7.9.2008) |
| 8. అతనోమందభాగ్యుడు | (పత్రిక-మాసపత్రిక-ఏప్రల్,2008) |
| 9. ఏప్రిల్‌ఫూల్ | (మూసీ-మాసపత్రిక-జనవరి,2009) |
| 10. కళ్ళలో పెళ్ళిపందిరి | (చేతన-మాసపత్రిక-సెప్టెంబర్2007) |
| 11. దక్కేదుంటే...!? | (ప్రజాశక్తి-దినపత్రిక-19.10.2008) |
| 12. తాళింటేన్స్ డే | (యోజన-మాసపత్రికఫిబ్రవరి2008) |
| 13. రేపటి సూరీడు | (విశాలాంధ్ర-డైలీ-18.11.2007) |
| 14.మైసమ్మసెప్పినసైన్మాకత | (భారతమాత-మాసపత్రిక-ఏప్రిల్, 2009) |
| 15. నిరుద్యోగపర్వంలో...!? | (ప్రజాశక్తి-డైలీ-16.3.2008) |
| 16. నాగులుతిరిగేకోనలో... | (ప్రజాశక్తి-డైలీ-11.5.2008) |
| 17. సంకల్పం | (సహకారసారధి-మాసపత్రిక-మార్చి, ఏప్రల్,2008) |
| 18. వల | (సూర్య-దినపత్రిక-ఆదివారం) |
| 19. ఎంత-'టీ'-రసికుడివో | (భారతమాత-మాసపత్రిక-ఫిబ్రవరి, 2009) |
| 20. దేహోద్ధారకులు | (జనవికాస్-వీక్లీ-12.9.2008) |

# I.నైవేద్యం

"అబ్బబ్బ! ఈ ముసలాడితో వేగలేక ఛస్తున్నాను. ప్రొద్దున్నకు ప్రొద్దున్న నాగులచవితని నైవేద్యానికని చేసుకున్న చలివిడి పెట్టమని చంటిపిల్లాడికి మల్లే చెయ్యిచాపేశాడు. చిమ్మిలి చేస్తుండగా బెల్లం తినేశాడు. నాఖర్మ. ఏవిటీ చిన్న పిల్లాడి చేష్టలు" అంటూ ఒకటే సణుగుడు సణుగుతూ ఉండిపోయింది మాధవీలత. ఆమె భర్త సోంబాబు అప్పుడే అక్కడికొచ్చి ఆవులిస్తూ "లతా ఏమిటా దరిద్రపుగోల. తెల్లవారిందా! ఎవరిమీద ఆ సణుగుడు" అంటూ గొణిగాడు.

"మీకేం భరించే దానికి తెలుస్తుంది కష్టం. మీ నాన్న గారికి ఐదుగురు కొడుకులుండగా మీరొక్కరే వున్నట్టు ఇక్కడికే రప్పింస్తుంటారు. ఆయన గారికి తెల్లవారగానే ఒకటే ఆకలి. దరిద్రుడికి ఆకలెక్కువ అన్నట్టు. పైగా ఇవ్వాళ నాగులచవితి గదా! నేను ప్రక్కింటి పార్వతి గారూ! పుట్ట దగ్గరకెళ్ళి పాలుపోసి నైవేద్యాలు పెట్టుకుందామనుకున్నాం! కాఫీ ఇచ్చాను. అబ్బే! చలిమిడంటారు. చిమ్మిలంటారు. చిమ్మిలకని తెచ్చిన బెల్లం ముక్కలు పళ్ళులేకపోయినా గూటంతో ముక్కలు కొట్టుకుని చప్పలించేస్తున్నారు. మీరెళ్ళి ముఖం కడుక్కురండి . ఫ్లాస్కులో కాఫీ పోశాను. తాగండి. నే వెళ్తున్నా!" అంటూ భర్త సమాధానానికైనా ఎదురు చూడకుండా పాలు, పళ్ళు, గుడ్లు వగైరాలు పూలసజ్జలో పెట్టుకుని వేగంగా వెళ్ళిపోయింది.

ముఖం కడుక్కుని సోంబాబు కాఫీ కప్పులో ఒంపుకుంటుండగా పరంధామయ్య వీధిలోంచి పేపర్ కొనితెచ్చుకుంటూ కొడుకు దగ్గరకొచ్చాడు. తండ్రితో పలకరింపుగా "నాన్న! కాఫీ తాగేవా!" అంటూ అడిగాడు. ఆ అయ్యిందన్నట్లు తలూపాడు పరంధామయ్య. అతని ముఖం చూస్తే తనతో ఏదో మాట్లాడాలని వున్నట్లు అర్థం చేసుకున్నాడు. తండ్రి దగ్గర పేపర్ అందుకుని హెడ్డింగ్సు చూస్తున్నాడు సోంబాబు. పరంధామయ్య కొడుకుతో నెమ్మదిగా "చిన్నా! నేను మనూరెళ్ళిపోతారా! ఎన్నాళ్ళిలా వారాలబ్బాయిలా నీ మీద పడి తినాలి" అన్నాడు. అతని మాటల్లో ఎక్కడో కించిత్ బాధ తొణికిసలాడింది. సోంబాబు పేపర్ టీపాయ్ మీద పెడ్తూ "అక్కడి కెందుకునాన్నా! లతో పిచ్చిది. నోటికొచ్చింది కోపంతో వాగేస్తుంది. ఆ తర్వాత తప్పుని లెంపలేసుకుంటుంది. దాని సంగతి నీకు తెలుసుగా! పొలం ఎలాగూ కౌలుకిచ్చేశావు కదా! అమ్మ ఎలాగూ లేదు. వెళ్ళి చేయికాల్చుకోవడం, అదీ ఈ వయసులో, నువ్వెళ్ళడానికి నేను ఒప్పుకోను. ఆగు, లతని రానీ ఏమన్నా అనుంటే నే కూకలేస్తాను" అన్నాడు. "నువ్వు కోడల్నేమైనా అంటే నేనొక్క క్షణం ఇంట్లో ఉండను. అయినా ఎక్కడి వాళ్ళు అక్కడే ఉండటం సబబు. ఎందుకంటావా తండ్రిగా నువ్వు నన్ను భరిస్తావు. నీలాంటి ఆలోచనే నీ అన్నలకు కొంచెం కూడా లేకపోయింది కదరా! కోడలు మాత్రం ఇద్దరు పిల్లలతో ఏం చేసి పెట్టగలదు. ఆమెకూ నీకూ భారంగా ఇంక ఉండలేను, వెళ్తా!" అన్నాడు.

సోంబాబు తండ్రి ఇంక ఎంతబ్రతిమాలినా ఉండడు. అతని పట్టుదల తనకి బాగా తెలుసు. సరే నీ యిష్టం అన్నట్లు తలూపాడు. పాపాయి, బాబు అక్కడి కొచ్చారు. పరంధామయ్య పిల్లల్ని ముద్దు చేస్తూ "నేను ఊరికి పోతున్నా న్రా! బాగా చదువుకోండేం! గొప్ప ఉద్యోగాలు చెయ్యాలి మీరిద్దరూను" అన్నాడు. ఆ ముసలి తాత మాటలకు అక్కా తమ్ముళ్ళు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. సరిత తాతను చుట్టేస్తూ కన్నీళ్ళతో "తాతా! నువ్వెళ్లిపోతే నాకు చాక్లెట్లు ఎవరిస్తారు? ఉండిపో! అమ్మతో నిన్ను విసుక్కోవద్దని చెబుతాలే!" అంది. విషయం పిల్లలిద్దరికీ కూడా తెలిసినందుకు తన చేతకానితనానికి సోంబాబు మారుమాట్లాకుండా వుండిపోయాడు. పట్నంలో ప్రతి చిన్నపనికీ ఎంతగానో పడిగాపులు పడాలి. ఈ చివరి రోజుల్లో తాను ఏ చీకూ చింతాలేకుండా బ్రతకాలి. అందుకు అనువైన వాతావరణం తాను పుట్టిన ఊరే అనుకున్నాడు పరంధామయ్య.

********* ********* ********

రిక్షా ఎక్కిన తండ్రి చేతిలో మూడుపచ్చనోట్లు పెట్టాడు సోము. "వద్దురా! నా దగ్గర డబ్బులేకనా! పైగా ఆస్తిపాస్తులు, అద్దె వస్తున్నాయిగా" అంటూ తాను తీసుకోకుండా ఉండిపోయాడు పరంధామయ్య. మాధవీలత మావగారి వైపు చూస్తూ "అయినదానికీ కానిదానికీ మనసు పాడు చేసుకోక నిశ్చింతగా ఉండండి. కూతుర్లాంటి దాన్ని నేనేమన్నా పొరపాటున అవాకులు చెవాకులు వాగితే పట్టించు కోకండి'' అంది. ఆమె మాటల్లో కొద్దిగా తానాయన్ని ఆదరించలేకపోయాననే బాధ మిళితమైఉంది. రిక్షా వెళ్తుండగా అంతా అటువైపు చేతులు ఊపారు. పరంధామయ్య అందరి వైపూచేతులు ఊపాడు.

ఇంటికొచ్చాడు పరంధామయ్య అతని మనసు మనస్సులో లేదు. సరిత తాతా! తాతా! అంటూ తనచుట్టూ చాక్లెట్లు అడుగుతున్నట్లు, బాబిగాడు వచ్చీరాని మాటలతో తనకాళ్ళకు చుట్టుకుపోతూ టా..తా! టా..తా! అంటూ పిల్చినట్లుగా అన్పించింది. ప్రక్కింటి వాళ్ళు అన్నంకూరలు పెట్టి పంపితే తిన్నది తినగా మిగిలింది పనిపిల్ల కిచ్చేశాడు. పరంధామయ్యలో ఆకలికి తట్టుకోని బలహీనత ఎక్కువ. అలాగని వాపిరి తిండి ఎరగడు. భార్యపోయాకా కమ్మని తిండికి తాను ముఖం వాచిపోయాడు. కోడలు మాధవిగాని, మిగిలిన పెద్దకోడళ్ళు నలుగురూ కూడా వారి వంట వారికి నచ్చినట్టుగా వండుకోవడమే! లేకుంటే ఏ హోటల్ మెతుకులో తినేయడమే! తన భార్య బ్రతికున్నంత కాలం జింహ్వా లేచివచ్చేటట్టు వండిపెట్టేది. ఏదీ ఆ పూర్వ వైభవం. ఆమె తోటే తన దంత సిరి అంతా మాయమైంది.

రాత్రి పెందరాళే కాస్సేపు టి.వి. చూసాకా పిల్లలతో బాటు వరండాలో వరిగి, తను గదిలో కెళ్ళి నిద్రలోకి జారిపోయింది మాధవీలత. ఆడవాళ్ళెందరో పుట్ట చుట్టూ తిరుగుతూ పాలుపోస్తూ, గుడ్లు చిదిమి పోస్తూ, చలిమిడి, చిమ్మిలి ఇంకా కొన్ని నైవేద్యాలు పెడుతున్నారు. నాగేంద్రుణ్ణి పాటలుపాడి మొక్కుకుంటున్నారు. కొత్తగా పెళ్ళైన పడుచులు చిళ్ళో పొళ్ళో మంటూ ఎకసెక్కాలు ఆడుకుంటూ పాలు పుట్టలో పోసి తిరిగి పోతున్నారు. మాధవీలత సవితని, బాబిగాణ్ణి దూరంగా వదిలిపెట్టి పాలున్న సీసా, గుడ్లున్న సజ్జా గోడమీదపెట్టి ప్రక్కింటి కామాక్షితో

కబుర్లాడుతోంది. బాబిగాడితో ఆడుకుంటున్న సరిత పుట్ట దగ్గరికెళ్ళి పలుగు తీసుకుని తవ్వుతోంది. బాబిగాడు భయంభయంగా అక్కా వద్దే! పాము వస్తుందే అంటూ బిక్కచచ్చిపోతూ చూస్తున్నాడు. పిల్లల్ని గమనించటంలేదు లత. ఇంకేముంది. తన ఉనికికి భంగం కలిగిస్తున్న సరిత మీదికి నాగేంద్రుడు బుస్సున బుసలుకొడ్తూ నిలువెత్తు లేచాడు. నిన్ను చంపుతానన్నట్లు తీక్షణంగా ఆమె మీదికి తల విసురుతున్నాడు.

బాబిగాడికి ఏం అర్థమైందో వెంటనే నాగరాజుని చూసి ఒక్కసారి రెండు చేతులూ దగ్గరకు జేర్చి దణ్ణం పెట్టాడు. పాముకి ఏమి అర్థమైందో పుట్ట లోనుండి మాధవీలత పాలు, గుడ్లు వగైరాలు తెచ్చిన సజ్జలోకి చేరింది. గుడ్డును తలతో కొట్టింది. అది చిదికిపోగానే దానిని హాయిగా భోంచేసింది. మాధవీలత కబుర్లను కట్టి పెట్టి తనపూల సజ్జవైపు చూసింది. 'అమ్మో! నాగేంద్రుడు' అంటూ బెంబేలెత్తిపోతూ వణుకుతున్న చేతుల్ని దగ్గరకు చేర్చి నమస్కరించింది. వెంటనే నాగరాజు మానవ రూపంలో ప్రత్యక్షమయ్యాడు. "నువ్వు నాకు పుట్టలో పాలు పోయడానికి వచ్చావు. వచ్చిన పనిమాని కబుర్లలో పడ్డావు. ఇలా చేస్తే నాకు కోపం రాదా! తెచ్చిన ఆహారం నాకు తొందరగా పెట్టకపోతే ఆకలి ఎక్కువ కాదా! నీ మావగార్ని మాడ్చినట్లు నన్నూ మాడుద్దామనుకుంటున్నావా! తప్పు తప్పు. నీ కూతురు నా పుట్ట తవ్వబోయింది. కాటసేవాణ్ణే! కానీ నీ కొడుకు సుబ్రహ్మణ్యం నన్ను కొలిచాడు. అందుకనే క్షమించి వదిలేశా! పెద్దల్ని పెద్ద మనసుచేసుకుని గౌరవించు. అప్పుడు నీ గౌరవం నిలుస్తుంది" అని చెప్పి అంతర్థానమయ్యాడు. తప్పై పోయిందని రెండూలెంపలూ వాయించుకుని మాధవీలత ఇంటిముఖం పట్టింది.

భర్త ఎప్పుడొచ్చాడో మీదచెయ్యి వెయ్యగానే లత ఖంగారుగా లేచింది. "లతా పిల్లల్ని టి.వి దగ్గర వదిలేసి గదిలో కొచ్చి మొద్దునిద్దరేవిటీ? అన్నట్టు ఇప్పుడు టైమెంతయ్యిందో తెలుసా నీకు?" అని ప్రశ్నించాడు సోంబాబు. ఆమె ఎంతై వుంటుందన్నట్లు భర్తవైపు క్వశ్చన్ మార్కు ముఖం పెట్టి చూసింది. అతను నవ్వుతూ "పదిన్నరఅయ్యింది" అన్నాడు. లేచి భర్తకు భోజనం పెట్టింది. మంచినీళ్ళ గ్లాసు ఎత్తి గటగటా త్రాగేసి ముఖానికి పట్టిన చెమట చీరకొంగుతో తుడుచుకుంది. భార్యను పరీక్షించి చూస్తూ "ఇంత సేపూ ఫేన్ క్రింద పడుకున్నా చెమటేవిటే! అంతలా పట్టేసింది" అన్నాడు సోము.

"ఏవిటింత ఆలశ్యం సిన్మాకెళ్ళారా?" అంటూ అడిగింది. ఔనన్నట్లు తలూపాడు. చేతులు, నోరు కడుక్కుని పుక్కిలించి ఉమ్మి గదిలోకి తిరిగి వచ్చాడు. "పీడ కల వచ్చిందండీ! ఆ కలలో నాగేంద్రుడు కనిపించాడు. నా మూలానే మీ నాన్న గారు మన ఇంట్లోంచి అర్థాంతరంగా వెళ్ళిపోయింది. నన్ను క్షమించండి. ఏదో ఓపికలేక, అశక్తితో ఈ చాకిరీ చెయ్యలేక విసుకున్నాను. తప్పే! ఆ మాత్రం దానికి మావగారు పెద్దవారైయ్యుండీ ఏదో తెలీక అనుంటుంది అని ఊరుకోవచ్చుగా" అంది. ఇంతకీ నన్నేంచేయమంటావు అన్నట్టు సోము భార్యవైపు ఆసక్తితో చూశాడు.

ఆమె నెత్తిమీద నీళ్ళకుండకి చిల్లుపడ్డట్టుంది. లత ఏదో మాట్లాడబోతుండగా కళ్ళంట నీరు ధారగా వచ్చేస్తోంది. మధ్యమధ్యలో చీరకొంగుతో ఆ తడి తుడిచేసుకుంటోంది. ప్రక్కమీదకు చేరిన భర్తకు చెక్కపొడి ఇచ్చింది. "లతా నాన్నకు నేనంటే ఎంతో ఇష్టం. అలాగని అన్నయ్యలంటే

ఇష్టంలేదనేం కాదు. ఏదో పెద్దవాడైపోయాడు. నువ్వు వంటైంది రమ్మంటే ఆకల్లేదంటాడు. రెండు గంటలు కొట్టాక నువ్వు మంచినిద్రలో వుండగా భోజనం పెట్టమంటే నీకు చిర్రెత్తుకొస్తుంది. నిజానికి ఈ పెద్దలు కూడా ఇటువంటి విషయాల్లో మారాల్సిన అవసరం వుంది. పిల్లల్ని, నేటిఅవసరాల్ని, పరిస్థితుల్ని వాళ్ళూ అర్థం చేసుకోవాలి. నాన్న నువ్వేం చెబితే అది వినే మనిషే! నువ్వన్న దానికి విరుద్ధంగా నడుచుకునే వ్యక్తేం కాదు" అన్నాడు. దూరంగా బైటికెళ్ళి చీదివస్తూ లత"మీరు వెంటనే ఇప్పుడంటే ఇప్పుడు కాదు. రేపు ప్రొద్దున్నే నేను అర్జెంటుగా బయల్దేరి వచ్చేయమన్నానని టెలిగ్రామ్ ఇవ్వండి. ఈ పాపం నాకెందుకు? ఆయనేమన్నా పరాయి మనిషా! నాకు మా నాన్నగారెంతో మావయ్యా అంతే!" అంది.
నవ్వుతూ సోంబాబు పెళ్ళాం చెయ్యిపట్టుకుని దగ్గరకు లాక్కుంటూ "నీతో వచ్చే చిక్కే ఇది. ఆనందం వచ్చినా, కోపం వచ్చినా, బాధ కల్గినా తట్టుకోలేవు" అన్నాడు. సోంబాబు ప్రక్కనే కూర్చుంటూ మాధవీలత కోరగా చూస్తూ "మీరు మాత్రం తక్కువా! పెళ్ళాం పక్కకు జేరినప్పుడు మంచిలౌక్యంగా, పేకాటలో డబ్బులు పోగొట్టుకునొచ్చినప్పుడు ముఖం చిట్లిస్తూ, ఆఫీస్‌లో మీ బాస్ తిట్టినప్పుడు ధుమధుమలాడుతూ, జీతాలు వచ్చిన రోజున క్రూడ్ జోక్సులు వెయ్యరూ! మనిషన్నాకా ఆడైనా, మగైనా కాస్త పట్టూవిడుపూ అవసరం. మీ మగాళ్ళంతా లోతుగుండె గలవాళ్ళు. ఏ విషయం నానిముచ్చులా పైకితేలరు మా ఆడవాళ్ళు ఏదొచ్చినా ముసుగులో గుద్దులాట లేకుండా పైకే బడబడా వాగేస్తారు. జరగండి అటు" అంటూ భర్త గుండెల మీద చెయ్యి వేసుకుని డబుల్‌కాట్ మీద ప్రక్కగా పడుకుంది.

నవరసాలూ పోషించగల శక్తి భగవంతుడు మగాళ్ళ కన్నా ఆడాళ్ళకే ఎక్కువగా ఇచ్చాడు. లేకపోతే ఈ మనిషి ప్రొద్దున్న నాన్న గురించి భద్రకాళిలా విరిచుకు పడింది. మధ్యలో సాయంకాలం వచ్చిన కల సెంటిమెంటు పుణ్యమా అంటూ చప్పున చల్లారిపోయింది అనుకుని తనలో తానే నవ్వుకున్నాడు సోంబాబు. ఎప్పుడు వేసిందో గుండెలమీద చెయ్యి,సోము ఆలోచనలను భగ్నపరుస్తూ వేసిందే తడవుగా దగ్గరకు జరిగింది. అతగాడు ఆమె కళ్ళలోకి చూసి బుగ్గ చిదిమేస్తూ "పిల్లలిద్దర్నీ అక్కడొదిలేసి ఇక్కడ పడుకుంటే మళ్ళీ పీడకలలొస్తాయేమో ఆలోచించు" అన్నాడు. అమ్మో నిజమే అన్నట్లు లేచి వరండాలోకి పరిగెట్టబోయింది. సోము ఆమె చెయ్యిపట్టి చిలిపిగా లాగాడు.

********** ********** **********

టెలిగ్రామ్ అందగానే పరంధామయ్య బయల్దేరదామని సంచిలో బట్టలు సర్దేశాడు. కానీ అభిమానం అడ్డు తగిలింది. పరోక్షంగా నాకు వినపడేలా చిన్న కోడలు ఎన్ని మాటలంది. అవన్నీ పక్కన బెట్టి తిరిగి ఏ ముఖం పెట్టుకుని కడసారపు కొడుకు ఇంటికెళ్ళాలి. వెళ్తే కోడలు ఆదరిస్తుందా! లేక మొదటి నాలుగు రోజులూ బాగా చూసి, ఆ తర్వాత సూటిపోటి మాటలతో నన్ను మానసికంగా హింసిస్తుందా అని అనుమానపడ్డాడు. ఇదో ఫార్స్‌లా తయారయ్యింది. ఎందుకో మనవలు సరిత, బాబిగాళ్ళని చూడకుండా తానుండలేదు. మనసు చంపుకోలేదు. సరిత, బాబిగాడూ తమ తమ చిట్టి పొట్టి చేతులుచాచి "తాతా!రా! మాఇంటికి రా! ప్లీజ్‌రా!తాతారా!"

అంటూ ఆబగా పిలిచినట్లైంది. ఇంటికి తాళంకప్ప వేసి గొడుగు, సంచీ తీసుకుని బస్సుస్టాండుకు బయల్దేరబోతుండగా "బాబాయ్ గారూ! మళ్ళీ మీ చిన్నకొడుకు ఇంటికేనా! వెళ్ళిరండి. అన్నట్టు మర్చిపోయాను. మీరైతు మొన్న మామిడి తోట తాలూకు అడ్వాన్సు సొమ్ము వెయ్యి రూపాయలిచ్చి వెళ్ళాడు. వెంటనే ఇవ్వాలనుకుని మర్చిపోయాను" అంటూ లోనికెళ్ళి తెచ్చి ఇచ్చింది ప్రక్కింటావిడ జానకమ్మ. ఆ సొమ్ము బనీను జేబులో పెట్టుకున్నాడు.

ఎదురింటి సూరమ్మ వేగంగా అక్కడికొస్తూ "బావా! మీ మనవడికి, మనవరాలికీ ఒంటిపేట గొలుసులు చెయ్యమని సొమ్మిచ్చి పోయావటగా! నిన్న నువ్వు బయటకెళ్ళినప్పుడు కంసాలి వీరాచారి వచ్చి ఇవి నీకిమ్మని చెప్పి వెళ్ళాడు" అంటూ ఆ రెండు చైన్లూ ఇచ్చి వెళ్ళింది. సంతోషంగా వాటిని చూసి కళ్ళకద్దుకుని లోపలున్న బనీను జేబులో పెట్టుకున్నాడు భద్రంగా పరంధామయ్య. "వస్తానమ్మా!" అని ఆ ఇద్దరి దగ్గరా సెలవు తీసుకుని బస్సు స్టాండువైపు నడిచాడు.

ఆటో దిగిన మావగారికి మాధవీలత ఎదురై సంచీ గొడుగూ అందుకుని లోపలపెట్టింది. కాళ్లు కడుక్కోడానికి చెంబుతో నీళ్ళందించింది. వెంటనే మనవలిద్దరికని చేయించిన రెండు చైనులూ కోడలికిస్తూ "ఇవి రెండూ ముందు దేవుడి పటం దగ్గర పెట్టి తర్వాత పిల్లలకి అలంకరించు" అన్నాడు. అప్పుడే సోంబాబు ఆఫీసు నుండి ఇంటికొచ్చాడు. పరంధామయ్య "చిన్నా! మామిడి తోట వాడు ఈ సంవత్సరం కాయలమ్ముకునే ముందు ఇచ్చిన అడ్వాన్సు వెయ్యి రూపాయలు. నీ ఇంట్లో తేరగా తినడం నాకు ఇష్టంలేదు. నే నెవరికీ భారం కాకూడదు" ఆ సొమ్ము అతని చేతిలో పెడ్తూ అన్నాడు.

మాధవీలత ఆ మాటలు ఆలకించి మావగారి పాదాల మీద పడి "మావయ్యా నేను పాపిష్ఠి దాన్ని . మీరు వెళ్ళి పోవడానికి కారణం నేను. నేనన్న సూటిపోటి మాటలు మిమ్మల్ని బాగా గాయపర్చి ఉంటాయి. నన్నుక్షమించండి. మీ మంచి మనసు అర్థం చేసుకోలేక మూర్ఖురాలనై మీపట్ల అమానుషంగా ప్రవర్తించాను. అనరాని మాటలన్నాను" అంటూ బావురుమంది. "లేదు తల్లీ!ఈ ముసలి ప్రాణం ఆకలికి తట్టుకోలేక అప్పుడు ఆ నాగులచవితి పూటా నేను కక్కుర్తిపడటం నీకు కోపం తెప్పించింది. మీరంతా నావాళ్ళే! అన్నీ మర్చిపో! వెళ్ళి కొద్దిగా మంచితీర్థం అందుకో" అన్నాడు బాబిగాణ్ణి ఒళ్ళోకి తీసుకుంటూ.

తల్లి కన్నా ముందు సరిత తన చిట్టి చేతులతో తాతగారికి నీళ్ళు తెచ్చిస్తూ "ఇంద తాతయ్యా" అంది. సోంబాబు ఫేన్ వేసి "లతా ఇద్దరికీ టీ పెట్టి తీసుకురా" అన్నాడు. ఆమె అలాగేనన్నట్లు లోనికెళ్ళిపోయింది. సరితను ముద్దాడి చాక్లెట్లు ఇచ్చాడు పరంధామయ్య. బాబిగాడూ చాక్లెట్లు తాతగారి దగ్గర పుచ్చుకున్నాడు. మాధవీలత ఇద్దరికీ టీ ఇచ్చింది. టీ తాగగానే "మావయ్యా మీరు స్నానం చేద్దురుగాని రండి. పెందరాళే వంటచేసేస్తా! ఒరేయ్ పిల్లలూ! ఇవ్వాళ తాతయ్య మీ ఇద్దరికీ బంగారు చైనులు తెచ్చారు " అంటూ ఇద్దరిమెళ్ళో వాటిని అలంకరించింది. వాళ్ళ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

(చేతన-మాసపత్రిక-జూలై,2007)

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Adhipatyam**

* * *